నామలగుండు కల్యాణ వెంకన్నస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే తలసాని, ఆలయ చైర్మన్ ప్రకాశరావు



నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తుల సందడి



వేంకటేశ్వరస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం



శ్రీదేవి, భూదేవి సమేత వెంకన్నస్వామి అలంకరణలో విద్యార్థినులు



ఉత్తరద్వార దర్శనం.. సర్వపాప హరణం



స్వామివారి కేలండర్‌ను పంపిణీ చేస్తున్న ఆకాంక్ష క్యాటరర్స్ అధినేత వేణుమాధవ్



కల్యాణ వెంకన్నస్వామిని దర్శించుకుంటున్న మేకల సారంగపాణి



రామాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ కంది శైలజ

వైకుంఠ ఏకాదశి (ముక్కోటి) పర్వదినం సందర్భంగా సికింద్రాబాద్, సనత్‌నగర్ వైష్ణవ ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. శుక్రవారం అర్ధరాత్రి నుంచే ఆలయాల్లో భక్తుల కోలాహలం మొదలయింది. భక్తుల రద్దీ దృష్ట్యా ఆయా దేవాలయాల నిర్వాహకులు ఉత్తర ద్వార దర్శనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సికింద్రాబాద్ జనరల్ బజార్‌లోని లక్ష్మీనారాయణ స్వామి మందిరంలో మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ గుమ్మడి శ్రీనివాస్, రవీందర్, దయానంద్‌రావు, నర్సింగ్‌రావు, రమేష్, చంద్రపాల్, ఈశ్వర్‌బాబు, నరేందర్, శ్రావణ స్వామివారిని దర్శించుకున్నారు. ఎస్పీరోడ్డు హనుమాన్ దేవాలయంలో జరిగిన ముక్కోటి ఏకాదశి ఉత్సవంలో బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి హాజరై పూజలు చేశారు. ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వెంకన్నస్వామి ఆలయాల వద్ద ఆధ్యాత్మిక సందడి నెలకొంది. నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాసయాదవ్, లాస్యనందిత, మాజీ మేయర్ కార్తీకచంద్రారెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు మేకల సారంగపాణి, కార్పొరేటర్ సామలహేమ ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని దర్శించుకున్నారు.

–సికింద్రాబాద్, సనత్‌నగర్ జోన్ల బృందం

గోవిందా నామస్మరణతో మార్మోగిన ఆలయాలు

వైకుంఠ ఏకాదశికి పోటెత్తిన భక్తులు




స్వామివారి కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీగిరి ప్రసన్న వెంకన్నస్వామి ఆలయ నిర్వాహకులు



స్వామివారిని దర్శించుకున్న బీఆర్‌ఎస్ నాయకుడు రామేశ్వర్‌గౌడ్ దంపతులు





ప్రత్యేక అలంకరణలో కల్యాణ వెంకటేశ్వరస్వామి



ఉత్తరద్వారం నుంచి స్వామివారిని దర్శించుకున్న కార్పొరేటర్ సామల హేమ



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మాజీ మేయర్ బండా కార్తీక చంద్రారెడ్డి దంపతులు



జనరల్ బజార్ లక్ష్మీనారాయణస్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి



ఎస్పీరోడ్డు హనుమాన్ దేవాలయంలో జరిగిన పూజలో పాల్గొన్న కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి



సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానంలో..



ఆలయంలో పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

విద్యతోనే బంగారు భవిష్యత్



ఐడీ కార్డులు అందుకున్న విద్యార్థులతో స్ఫూర్తి

పద్మారావునగర్: విద్యతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉందని టాలెంట్ స్ప్రింట్ సంస్థ డైరెక్టర్ వి. స్ఫూర్తి అన్నారు. సంస్థ తరఫున ఆమె సొంత డబ్బులతో భోలక్‌పూర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు టై, బెల్ట్, ఐడీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్ఫూర్తి మాట్లాడుతూ.. పేద కుటుంబంలో పుట్టిన తాను కష్టపడి ఈ స్థాయికి వచ్చానన్నారు. విద్యార్థులు మీ భవిష్యత్ మీ చదువుపైనే ఆధారపడి ఉందనే విషయాన్ని గ్రహించాలన్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా చదువును మాత్రం ఆపరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వేదవిద్యను అందరికీ అందుబాటులోకి తేవాలి



అనుగ్రహభాషణం చేస్తున్న కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి

చిలకలగూడ: వేద విద్యను అందరికీ అందుబాటులోకి తేవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి అన్నారు. శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయం శనివారం జరిగిన వైకుంఠ ఏకాదశి వేడుకల్లో ఆయన పాల్గొని అనుగ్రహభాషణం చేశారు. లోకంలో వేదం, ధర్మం పరిఢవిల్లాలని, అన్ని దేవాలయాల్లోనూ వేదవిద్య ప్రవేశ పెట్టాలన్నారు. వేద పఠనం ఎంతో ఆధ్యాత్మిక, ఆరోగ్యకరమైన ప్రకరణమని, ప్రతి ఒక్కరు రోజులో కొంత సమయం వేద పఠనానికి కేటాయించాలని సూచించారు. శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగుతుందని, మరోమారు సందర్శించి ఆలయ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తానని తెలిపారు. అనంతరం పలువురు వేద పండితులు, ఆలయ నిర్వాహకులతో పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, వేణుగోపాలరావు, ఈఓ రాజేష్‌కుమార్ ప్రతినిధులు బాల భాస్కర్, ఆత్మారామసూర్యసుబ్రహ్మణ్యం, నారాయణన్, శివశంకరన్, సుజయ్‌ప్రకాశ్, రామచందర్ పాల్గొన్నారు.

‘డబుల్’ ఇళ్ల పరిశీలన

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేట సాయినగర్‌లో నిర్మాణ దశలో ఉన్న డబుల్ బెడ్రూమ్ ఇళ్లను శనివారం సీపీఐ నేతలు పరిశీలించి మాట్లాడారు. ఏడాదిలోనే ఇళ్లు పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తామని హామీ ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా ఇంకా నిర్మాణ దశలోనే ఉన్నాయని మండిపడ్డారు. వెంటనే ఇళ్లను పూర్తిచేసి అర్హులందరికీ కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంపల్లి శ్రీనివాస్, కొమరెల్లి బాబు, గువ్వల మల్లేష్, శ్రీహరి, నాగరాజు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ మంజూరు పత్రం అందజేత



మంజూరు పత్రాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: గుండె సంబంధిత సమస్యతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందుల కారణంగా సరైన వైద్యం చేయించుకోలేక ఇబ్బంది పడుతున్న నిరుపేద కుటుంబానికి సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అండగా నిలిచారు. బాధితుడి వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి ఆర్థిక సహాయం నుంచి మంజూరైన రూ.2 లక్షల మంజూరు పత్రాన్ని శనివారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అమీర్‌పేట డివిజన్ బీజేఆర్‌నగర్‌కు చెందిన నిమ్మ అనిల్ కొంతకాలంగా గుండె సంబంధిత సమస్యతో బాధపడుతూ వైద్యుల వద్దకు చికిత్స కోసం వెళ్లారు. అనిల్‌కు పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆపరేషన్ చేయాలని, అందుకు భారీగా ఖర్చు అవుతుందని చెప్పారు. దీంతో అనిల్ కుటుంబ సభ్యులు మాజీ కార్పొరేటర్ శేషుకుమారి సహకారంతో తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి తమ పరిస్థితిని వివరించి వైద్య చికిత్స కోసం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2 లక్షలు మంజూరు చేయించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి, బీజేఆర్‌కు చెందిన శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిష్యం కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

బన్సీలాల్‌పేట్: జ్యోతిష్యం శాస్త్రంపై ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. సికింద్రాబాద్‌కు చెందిన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఆస్ట్రోలాజికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో జ్యోతిష్యం ఇతరత్రా కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామని నిర్వాహకులు రాంచందర్‌రావు పేర్కొన్నారు. జ్యోతిష్యం, వాస్తు, హస్తరేఖ శాస్త్రాల్లో జ్యోతిష్ ప్రవీణ, జ్యోతిష్య విశారద కోర్సులకు శిక్షణ ఇస్తున్నట్లు రాంచందర్‌రావు చెప్పారు. ఆసక్తి గల యువతీ, యువకులు సికింద్రాబాద్ పద్మారావునగర్‌లోని శ్రీ కొతాకామకోటి కల్యాణ మండపం ఆవరణలోని కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 92463 48354, 99890 88111 నంబర్లను సంప్రదించాలన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి



రసూల్‌పురా: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని హైదరాబాద్ జిల్లా క్రీడా అధికారి సుధాకర్ సూచించారు. సికింద్రాబాద్ జింఖానా మైదానంలో బాలంరాయి మమత హైస్కూల్ క్రీడోత్సవ కార్యక్రమానికి సుధాకర్ హాజరై కరస్పాండెంట్ ఇందిరా దేవీతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఆటల్లో గెలుపు ఓటములు సహజమని ఓడిన వారు కుంగిపోకుండా గెలుపు కోసం ప్రయత్నించాలన్నారు. తమ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు వివిధ క్రీడల్లో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సుధాకర్ బహుమతులు ప్రదానం చేశారు.

పనిచేసే దుకాణానికే కన్నం

రూ. 20 లక్షల చోరీ నిందితుడి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ శరత్‌చంద్ర పవార్

రాంగోపాల్‌పేట్: నమ్మకంగా ఉంటూ యజమాని దుకాణం లోంచి రూ.20 లక్షలు కాజేసిన ఘటన లేక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ శరత్‌చంద్ర పవార్ గాంధీనగర్ ఏసీపీ రవికుమార్, ఇన్‌స్పెక్టర్ డేబోరా, డీఐ రామకృష్ణలతో కలిసి వివరాలు వెల్లడించారు. కార్ఖానాకు చెందిన కేశవ్ అగర్వాల్ ఎంజీరోడ్డులోని రాణిగంజ్‌లో రామన్ ట్రేడింగ్ పేరుతో హార్డ్‌వేర్ దుకాణం నిర్వహిస్తున్నాడు. గద్వాల్ జిల్లా పూడూరుకు చెందిన వీరన్న అలియాస్ వీరేష్(30) ఏడాది క్రితం కేశవ్ అగర్వాల్ షాపులో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తుండగా ఆయన భార్య యజమాని ఇంట్లో పని చేస్తోంది. ఏడాది నుంచి ఎంతో నమ్మకంగా పనిచేస్తున్న వీరన్న, హార్డ్‌వేర్ దుకాణంలో రూ. లక్షల్లో డబ్బులు ఉంచడాన్ని గమనించగా వాటిని తస్కరించాలని పథకం పన్నాడు. ఈ నెల 20న రాత్రి యజమాని లాకర్‌లో రూ.20 లక్షలు ఉంచి ఇంటికెళ్లాడు. అదే రోజు లాకర్‌లోని డబ్బును కాజేయాలని వీరన్న నిశ్చయించుకుని ఎలక్ట్రీషియన్‌గా పనిచేసే వీరన్నకు సీసీ కెమెరాల గురించి బాగా తెలుసు. దీంతో విద్యుత్ సరఫరా ఉంటే తన దొంగతనం గురించి తెలుస్తుందని భావించి అర్ధరాత్రి సమయంలో దుకాణం వద్దకు చేరుకుని ట్రాన్స్‌ఫార్మర్‌ను బంద్ చేశాడు. అక్కడున్న కిటికీ గ్రిల్ తొలగించి ఆక్సాబ్లేడ్‌తో లాకర్ తాళాన్ని కత్తిరించి అందులో ఉన్న నగదును తస్కరించారు. మరోసటి రోజు దుకాణం తెరిచిన యజమానికి లాకర్ తెరచి ఉండటం అందులోని రూ.20లక్షల నగదు కనిపించలేదు. కేసు నమోదు చేసుకున్న లేక్ పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. సీసీ కెమెరాల్లో లభించిన ఆధారాలతో నిందితున్ని అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం విషయం ఒప్పుకోవడంతో రిమాండుకు తరలించారు.

రాష్ట్రస్థాయి బాలికల బాక్సింగ్ పోటీలు ప్రారంభం



బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న మధులత

అడ్డగుట్ట: బాలికలు అన్ని రంగాల్లో రాణించే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని లాలాగూడ ఇన్‌స్పెక్టర్ మధులత అన్నారు. తెలంగాణ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ బాక్సింగ్ టోర్నమెంట్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. తెలంగాణ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సౌజన్యంతో హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జూనియర్ కాలేజ్ అండర్–19 బాలికల, స్కూల్స్- అండర్- 17 బాలికల విభాగాల పోటీలు సౌత్ లాలాగూడలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో బాలికలు తమదైన శైలిలో అన్ని పోటీల్లో రాణిస్తున్నారని, దీనికి తల్లిదండ్రుల సహకారం, ప్రోత్సాహం కూడా ఎంతో అవసరమన్నారు. స్థానికంగా ఉన్నటువంటి పలువురు క్రీడాకారిణులు బాక్సింగ్‌లో ఎంతగానో శిక్షణ పొందుతున్నారని, వీరికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పాల్గొనే అవకాశాలు రావాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి. లక్ష్మయ్య, హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ ఎం. పర్వతాల గౌడ్, ఫిజికల్ డైరెక్టర్లు జక్కయ్య, మేరీ, ఉమారావు పాల్గొన్నారు.

సందడిగా క్రిస్మస్ వేడుకలు

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ భోలక్‌పూర్‌లోని క్రిష్ణవేణి పాఠశాలలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రంగు రంగుల దుస్తుల్లో విద్యార్థులు క్రిస్మస్ తాతయ్య గెటప్‌లో అలంరించారు. పాఠశాల ఆవరణలో క్రిస్మస్ ట్రీతో పాటు విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ డాక్టర్ మంచాల శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. యేసుక్రీస్తు సమాజానికి చూపిన మార్గం ఎంతో గొప్పదన్నారు. ప్రేమ, దయా, కరుణ వంటి గుణాలతో ప్రతి ఒక్కరిని ప్రేమతో చూడాలన్నారు. యేసుక్రీస్తు బోధనలు ప్రస్తుత సమాజానికి ఎంతో అవసరమన్నారు. పాఠశాలలో అన్ని పండగలు, వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు.

అమరావతి విద్యాసంస్థల ఆధ్వర్యంలో..

చిలకలగూడ: అమరావతి విద్యాసంస్థల నేతృత్వంలో నామాలగుండు అమరావతి టాలెంట్ స్కూలులో శనివారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు క్రిస్మస్ తాత వేషధారణలో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు, పర్వదినాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రతిఏటా అన్ని మతాలకు చెందిన పండుగలను పాఠశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్నామన్నారు.



క్రిస్మస్ వేడుకల్లో సందడి చేస్తున్న విద్యార్థులు



విభిన్న వేషధారణలో చిన్నారులు

రాష్ట్ర అప్పులపై ఓయూలో చర్చ

ఉస్మానియా యూనివర్సిటీ: బీఆర్‌ఎస్ పాలనలో ప్రభుత్వం చేసిన రూ.6,71,757 కోట్ల అప్పుల పై ఓయూలో వినూత్నంగా బహిరంగ చర్చ జరిగింది. శనివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట పీహెచ్‌డీ విద్యార్థి, టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చర్చ కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ప్రొఫెసర్లు పాల్గొని చర్చించారు. మాజీ సీఎం కేసీఆర్ పదేళ్ల అహంకారపూరిత పాలనలో వైఫల్యాలు, కమీషన్ల కోసం అను ఉత్పాదక రంగాలపై అధిక పెట్టుబడులు పెట్టి తద్వారా ఆర్థిక దోపిడీ అనే అంశాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. అధ్యాపకులతో పాటు విద్యార్థి నేతలు మేడ శ్రీనివాస్, బొమ్మర సమ్మయ్య, నెల్లి సత్య, ఉదయ్, సుమన్ పాల్గొన్నారు.

ఆదివాసీ హక్కులను కాపాడాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివాసీ హక్కులను కాపాడాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం ఓయూ క్యాంపస్ టెక్నాలజీ కాలేజీ ఆడిటోరియంలో ఆదివాసీ స్టూడెంట్ యూనియన్ (ఏఎస్‌యూ) రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. కార్యక్రమానికి ఆదివాసీ పరిశోధక విద్యార్థి సాగబోయిన పాపారావు అధ్యక్షత వహించగా తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డా.మైపతి అరుణ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆదివాసీ ప్రజల ఆత్మగౌరవం, అస్థిత్వ పోరాటాలకు విద్యార్థులు నాయకత్వం వహించి హక్కులను కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో గణేష్, రవీందర్, ప్రొ.రేగ రాజేందర్, కొప్పుల రవి, అరుణ్‌కుమార్, ప్రవీణ్, వెంకన్న, సతీష్, సుగుణ, కిషన్ పాల్గొన్నారు.

కారును ఢీకొట్టిన అడవి పంది

ఇద్దరు మృతి, ముగ్గురికి గాయాలు

కల్హేర్(నారాయణఖేడ్): కారును అడవి పంది ఢీకొట్టడంతో బోల్తాపడి ఇద్దరు మృతి చెందగా, ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటనా శుక్రవారం అర్ధరాత్రి నిజాంపేట మండలం బాచేపల్లి వద్ద సంగారెడ్డి–నాందేడ్ 161 జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. హైదరాబాద్ తిరుమలగిరి ప్రాంతానికి చెందిన ఐదుగురు స్నేహితులు దులపల్లి చంద్రశేఖర్ (26), ఫణీందర్(27), చెన్నకేశవులు, బాల మల్లేశ్, కిషోర్‌కుమార్ కారులో షిర్డీకి బయల్దేరారు. బాచేపల్లి సమీపంలో అడవి పంది అడ్డువచ్చి కారును బలంగా ఢీకొట్టడంతో ఒక్కసారిగా బోల్తా పడింది. దులపల్లి చంద్రశేఖర్ అక్కడికక్కడే మృతి చెందగా నలుగురిని చికిత్స నిమిత్తం నారాయణఖేడ్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా ఫణీందర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మిగిలిన ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

యజమాని వేధింపులతో ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతున్న బాధితుడు

అడ్డగుట్ట: యజమాని వేధింపులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని బుద్ధవరంకు చెందిన మహేష్ (33) సికింద్రాబాద్‌లోని మెట్టుగూడ సాయిబాబా దేవాలయం వద్దనున్న రైల్వే క్వార్టర్స్‌లో ఇంట్లో ఉంటున్న దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ సీఎంఎం ఎలక్ట్రికల్ అధికారి ఆళ్ల రమణ ఇంట్లో 17 ఏళ్లుగా ఇంటి పని చేస్తున్నాడు. అధికారి వికలాంగుడు కావడంతో వీల్‌చైర్‌లో ఆఫీస్‌కు ఇంటికి తీసుకురావడం అనంతరం ఇంట్లో అన్ని పనులు చేయాల్సిన ఉద్యోగం మహేష్‌ది. 2016లో మహేష్‌కు రైల్వే ఉద్యోగం కోసం అపాయింట్‌మెంట్ వచ్చింది. 2019 వరకు బాగానే పని చేసిన మహేష్‌కు అధికారి నుంచి వేధింపులు మొదలయ్యాయి. 2019లో మహేష్ అనారోగ్యానికి గురి కావడంతో మూడు రోజులు సెలవు కావాలని కోరినా అధికారి ఇవ్వలేదు. జ్వరం ఉండటంతో మహేష్ మూడు రోజులు పనికి రాలేదు. అప్పటి నుంచి మహేష్‌పై ఆగ్రహం పెంచుకున్న రమణ మూడు నెలల నుంచి జీతం కూడా సరిగా ఇవ్వడం లేదు. తనకు జీతం ఇవ్వమని పదే పదే ప్రాధేయపడినా రమణ ఇవ్వడం లేదు. శనివారం మధ్యాహ్నం మహేష్ రైల్ నిలయంలోని 6వ అంతస్తులో ఉన్న రమణ ఛాంబర్‌లోకి వెళ్లి మరోసారి జీతం అడిగిన రమణ స్పందించకపోవడంతో అదే ఛాంబర్‌లో వీల్ చైర్‌లో కూర్చున్న రమణ ముందే తనతో తెచ్చుకున్న తాడుతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అదే సమయంలో మరో ఉద్యోగి రమణ ఛాంబర్‌లోకి రాగానే ఫ్యాన్‌కు వేలాడుతున్న మహేష్‌ను చికిత్స నిమిత్తం మెట్టుగూడలోని రైల్వే హాస్పిటల్‌కు తరలించగా ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు.